విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా
శనివారం 18 జనవరి, 2025. 4 పేజీలు

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న పమిడి రవికుమార్ చౌదరి

విశాలాంధ్ర-దగదర్తి: దగదర్తి మండలం మనుబోలుపాడు కు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. శుక్రవారం లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. సభ్యత్వ కార్డును కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న రవికుమార్ చౌదరి ని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అభినందించారు.

జిల్లా అంతా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత దివస్

జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:ప్రతినెల మూడవ శనివారం జిల్లా అంతా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛతా కార్యక్రమాలపై చేపట్టవలసిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తుందని ప్రతి మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛత దివస్ కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువగా భాగస్వాములు అయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ,పట్టణాలలో వీధులను, డ్రైనేజీలను, త్రాగునీటి వనరులను, ఓహెచ్ఎస్ఆర్లను శుభ్రపరచడం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన సోక్ పిట్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గ్రౌండ్ అయ్యేవిధంగా చూడాలని డ్వామా అధికారులకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయాలన్నారు. పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా,గ్రామీణాభివృద్ధి,డ్వామా,వైద్య ఆరోగ్య శాఖ ,మునిసిపల్ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో కీలక పాత్ర వహించాలని, ప్రజలను,ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ స్వాములను చేయాలన్నారు. ప్రతి శాఖలో ఈ కార్యక్రమాలను సమన్వయ పర్చడానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు.

విఆర్సి సెంటర్ నుండి నేటి ఉదయం ర్యాలీ

శనివారం ఉదయం నెల్లూరు వి ఆర్ సి సెంటర్ నుండి ర్యాలీ నిర్వహించి,మానవహారం గా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తారు.వీఆర్సీ సెంటర్లో జరిగే ర్యాలీలో జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణ తీరు మెరుగుపరచండి: కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు:నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 7 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ వాటి నిర్వహణ తీరును మెరుగుపరచాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ల నోడల్ అధికారులు, క్యాంటీన్ ల నిర్వాహకులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయం లోని కమిషనర్ చాంబర్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో పాత మున్సిపల్ ఆఫీస్, తడికల బజార్ కూడలి, ఇందిరా భవన్ రోడ్డు, ఫిష్ మార్కెట్, వెంగళరావు నగర్, మద్రాసు బస్టాండ్, రామ లింగాపురం కూడలి ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ప్రజలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. అన్న క్యాంటీన్లలో క్వాలిటీ, క్వాంటిటీలను మెరుగుపరిచి, ఆహారంలో రుచి శుచి ఉండేలా అధికారులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్నా క్యాంటీన్ ల నిర్వాహకులు ప్రతీ క్యాంటీన్ లో తప్పని సరిగా 7మంది సిబ్బంది ఉండేలా చూసుకోవాలని, తయారీ ప్రాంతం నుంచి క్యాంటీన్ లకు సరఫరా చేసేందుకు, క్యాంటీన్లో ప్రజలకు వడ్డించేందుకు అవసరమైన మేరకు సిబ్బందిని పెంచుకోవడంతో పాటు తోపులాటలు జరగకుండా సెక్యూరిటీ ఏర్పాట్లను పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది హాజరు పట్టిక, విజిటర్స్ హాజరు పట్టిక, ఫిర్యాదుల పట్టికలను ప్రతి క్యాంటీన్లో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అన్ని క్యాంటీన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి క్యాంటీన్లో స్వచ్ఛమైన తాగునీరు కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, ఎప్పటికప్పుడు ఆహారపు ప్లేట్లను శుభ్రపరచడం, ఆహారం అందించే వేళలను రద్దీ మేరకు పెంచడం, ఎక్కువ ఆహారం అవసరమైన క్యాంటీన్ కు ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడం వంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పోలీసు విభాగం వారి సహకారంతో అన్ని క్యాంటీన్లలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించిన ఏ ఒక్క అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఏవైనా సమస్యలు ఉంటే తప్పనిసరిగా తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు చెన్నుడు, ఇనాయతుల్లా, వేణు, రహంతూ జానీ, డాక్టర్ చైతన్య, శ్రీనివాసులు, శేషగిరి రావు, క్యాంటీన్ ల నిర్వాహకులు గణేష్, అనిల్, సాయి, నిఖిల్ పాల్గొన్నారు.

అనధికార లేఔట్స్‌పై దూకుడుగా వ్యవహరిస్తాం

- నుడా చైర్మన్ కోటంరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న లేఔట్స్ ని డెమోలిష్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.. అనధికార లేఔట్లలో ప్రజలు ఎవరూ ప్లాట్లు కొనొద్దని.. అయన పిలుపునిచ్చారు. నుడా అధికారులతో ప్రత్యేకంగా తన చాంబర్లో సమావేశమైన ఆయన.. పలు ఆదేశాలు జారీ చేశారు. అనధికారకంగా ఉన్న మరో 44 లేఔట్లను గుర్తించామని, వాటిని కూడా డెమోలిష్ చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నుడాలో నూతన సంస్కరణలు తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. నుడా అనుమతులు లేకుండా.. లేఔట్స్ వేసిన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, వాటిని డెమోలిష్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 8 నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే 260కి పైగా లేఔట్స్ గుర్తించగా కొత్తగా మరో 44 గుర్తించామన్నారు. ఈ లేఔట్స్ లో హద్దురాళ్ళు పీకేసిప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు నుడాను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు కోటంరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఓ హిమబిందు, సెక్రటరీ పెంచల్ రెడ్డి పాల్గొన్నారు

రైతుల భాగస్వామ్యంతో

కాలువలను మెరుగ్గా తీర్చిదిద్దడం కాకాణి దృష్టిలో తప్పే: సోమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు :వైసీపీ ప్రభుత్వంలో తన లాగా ఒక్క 2023 డిసెంబరులోనే రూ.18.50 కోట్లను ఐదు ప్యాకేజీలుగా విభజించి భోంచేయలేదని కాకాణి గోవర్ధన్రెడ్డి తెగ బాధపడిపోతున్నాడు. నక్కల కాలువలో పైపైనే కలిబెట్టి12 కోట్లు తినేయలేదని,ఫీల్అయిపోతున్నాడు.మొత్తంగా ఐదారు ప్యాకేజీల పేరుతో రూ.30 కోట్లు స్వాహా చేయకుండా రైతుల భాగస్వామ్యంతో పనులు చేస్తే ఎట్లా అని రగిలిపోతున్నాడు తనలా ఏ ఊరిలో ఏ రైతుకు కూడా తెలియకుండా నిధులు స్వాహా చేసేయకుండా అన్నదాతలకు ఉపయోగపడేలా పనులు జరగడంతో జీర్ణించుకోలేక పోతున్నాడు. అది కూడా రూ.10 కోట్లతో 130కి పైగా పనులను(డీసిల్టింగ్,(డ్రైన్స్) స్థానిక రైతుల భాగస్వామ్యంతో చేయడంతో తనకలాడిపోతున్నాడు. చేసిన పనులకే మళ్లీ మళ్లీ బిల్లులు చేసుకోవడం లేదని తెగ బాధపడిపోతున్నాడుఅసలు పనులే చేయకుండా తనలా బిల్లులుస్వాహా చేస్తేనే కాకాణి గోవర్ధన్ రెడ్డికి హ్యాపీప్రజలందరికీ ఉపయోగపడేలా పారదర్శకంగా పనులు చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని తిట్టడానికే గోవర్ధన్ రెడ్డికి వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినట్టుందినకిలీ మాటలుకల్తీ స్టేట్మెంట్లు ఇవ్వడానికే కాకాణికి జిల్లా బాధ్యతలు అప్పజెప్పినట్టున్నారు. ఎవరెన్ని మాట్లాడినా, ఎన్ని గావు కేకలు పెట్టినా సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదేళ్ల తర్వాత ఇరిగేషన్ వ్యవస్థ ఎంతలా బాగుపడిందో ఆయా గ్రామాల ప్రజలకు తెలుసు..ఆయకట్టు రైతులకు తెలుసుఅని ఎంఎల్ ఏ సోమిరెడ్డి రెడ్డి అన్నారు.

ఎన్‌సిసి విద్యార్థినులను అభినందించిన కరస్పాండెంట్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ :గుంటూరు గ్రూప్ పరిధిలో జరగనున్న ఏపీ ట్రెక్-3 కొండవీడు క్యాంప్ 16-01-2025 నుంచి 23-01-2025 వరకు జరగనుండగాఈ క్యాంపుకు ఏపీ అండ్ తెలంగాణ నుంచి 510 ఎన్సిసి క్యాడెట్లుపాల్గొననున్నారు ఇందులో మన గుంటూరు గ్రూపు అండర్ లో ఉన్నటువంటిఈ 34 ఆంధ్ర బెటాలియన్ పరిధిలో ఉన్న ఉన్నటువంటి 185 ఏ %షిశీ% కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి మరియు మన ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి నలుగురు సీనియర్ వింగ్ క్యాడెట్లుఎంపిక కావడం జరిగింది ఆ నలుగురు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్విద్యార్థినిలు ఎన్.మాధవి,ే స.శ్రీవేణి,కే.మల్లేశ్వరి,సుకన్యలు ఎంపిక కావడం గర్వకారణం ఈ క్యాంపు యొక్క ముఖ్య ఉద్దేశం గుంటూరు యొక్క చారిత్రాత్మక ప్రాంతాలైన కొండవీడు మొదలగు ప్రాంతాలలో క్యాడెట్లను ట్రెక్కింగ్ కి తీసుకు వెళ్లడంజరుగుతుంది అదే విధంగా క్యాడెట్లు యొక్క ఫిజికల్ ఫిట్నెస్ అబ్జర్వ్ చేస్తారని ఇంటర్నేషనల్ మౌంట్ నీర్ షేక్ హిమామ్నా వెల్లడించారు.ఇలాంటి క్యాంపులకు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్సిసి విద్యార్థులు సెలెక్ట్ కావడం ఎంతో ఆనందకరంగా ఉందని కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రామయ్య , టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే.విజయ్ శ్రీనివాస్ ఎన్సిసి నిర్వాహకులు అకడమిక్ ఇన్ చార్జ్ మీరావలి,సహాయక ఎన్సిసి ఇన్ చార్జ్ సంతోష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

మొబైల్ షాపులో లక్కీడ్రా

విశాలాంధ్ర:-రాపూరు:రాపూరు పట్ట ణం లోని ఆర్టీసి బస్టాండ్ లో అంక మ్మ తల్లి మొబైల్ షాపులో లో సంక్రాంతి,జనవరి నెల లో టీవీలు, మొబైల్ లు కొన్న వారికి లక్కీ డ్రా కూపన్ ఇవ్వబడినది ఈ నెల 17 వతేదీ శుక్రవారం రాపూరు ఏపి ఎస్ ఆర్టీసి డిపో మేనెజర్ వై అనిల్ కు మార్ చెతుల మీదుగా లక్కీ కూపన్‌లు డ్రా లో లక్కీ విజేతలను కూప న్లు ప్రథమ,ద్వీతీయ,తృతీయ బ హుమతులు డ్రాలో తీసిన పెర్లను తీసారు. మొత్తం 40 బహుమతు లు అని అంకమ్మ తల్లి మొబైల్ అదినేత మ హేష్ తెలియజెసారు.

బాల కార్మిక నిర్మూలనే ధ్యేయం
-జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ

విశాలాంధ్ర- పీలేరు : పాన్ ఇండియా రెస్క్యూ మరియు రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాం అగైనెస్ట్ చైల్డ్ లేబర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ పాన్ ఇండియా బాల కార్యక్రమం కార్మిక (రెస్క్యూ రిహాబిలిటేషన్) నిర్మూలన మరియు పునరావాస కార్యక్రమం శుక్రవారం అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం నందు లేబర్ డిపార్ట్మెంట్ లేబర్ ఆఫీసర్ కేఆర్ ఆనందబాబు పీలేరు పోలీస్ పోలీస్ మరియు విద్యా, వైద్య, శిశు సంక్షేమ మరియు న్యాయ శాఖల సమన్వయంతో స్థానిక గ్రేట్ విజన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వారి సౌజన్యంతో పీలేరు పట్టణ మరియు పరిసర ప్రాంతాలలో బాల కార్మిక నిర్మూలన మరియు బాల కార్మిక చట్టం అవగాహన గురించి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ కె.ఆర్ ఆనందబాబు గారు మాట్లాడుతూ బాల కార్మికులను ప్రోత్సహించడం చట్ట రీత్య నేరమని అలా ప్రోత్సహించినవారు జైలుశిక్ష మరియు జరిమానాలతో శిక్షింప బడతారని అన్నారు. మండల విద్యాశాఖ అధికార ద్వయం మాట్లాడుతూ పీలేరు మండల పరిసర ప్రాంతాల్లో బడి బయట పిల్లలు శాతం తగ్గిందని ప్రతి ఒక్కరిని బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఇంకా ఎవరైనా ఉంటే మా దృష్టికి తీసుకొస్తే అందరినీ బడిలో ఉండేలా చేస్తామని అన్నారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ మరియు గ్రేట్ విజన్ సొసైటీ లు మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి బిడ్డ బడిలోనే ఉండాలని ప్రతి బిడ్డకు సరైన పోషకాహారం అందించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్థానికులు కాకుండా వలస వచ్చిన వారు ఎవరైనా ఉంటే పునరావాసం తో పాటు విద్య వైద్యం మరియు సకల సౌక ర్యాలు మా సంస్థ ద్వారా అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ గారితో పాటు అన్ని శాఖల సమన్వయకర్తలు, మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా జరుపుకుందాం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : ఫ్లెమింగో ఫెస్టివల్ 2025- ప్రకృతి, సంస్కృతి, జీవవైవిధ్యాల మహోత్సవాన్ని ఈనెల 18,19 మరియు 20 తేదీలలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సూళ్లూరుపేట పులికాట్ సరస్సు, అటకాని దిబ్బ ఏర్పాట్లు పరిశీలన అనంతరం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నందు ప్రారంభోత్సవం మరియు ముగింపు కార్యక్రమంకు సంబంధించిన వేదిక ఏర్పాట్లను జిల జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే నెలవెల విజయశ్రీ తో కలసి జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ.. సుమారుగా 4 సంవత్సరాల తర్వాత మనం ఫ్లెమింగో ఫెస్టివల్ - 2025 నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. గత నెలలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు జిల్లాకు విచ్చేసినపుడు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పునఃప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారని, అందులో భాగంగా జనవరి 18, 19, 20 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని 5 ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దొరవారిసత్రం మండలం నేలపట్టు, సూళ్ళూరుపేటలో అటకానితిప్ప, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నందు ప్రారంభోత్సవం మరియు ముగింపు కార్యక్రమం ఇక్కడే నిర్వహించబడుతుందని తెలిపారు. అడ్వెంచర్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీ సిటీ నుండి, షార్ నుండి స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బి.వి.పాలెం బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సారి కొత్తగా శ్రీ సిటీ వారి సౌజన్యంతో శ్రీ సిటీ లో దేశ నలుమూలల నుండి అటవీ సంపదకు సంబంధించి తడినేలల్లో వచ్చే పక్షుల పరిశీలించే ఎన్జిఓ లు, %××% తిరుపతి, %××రాజు=%, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మరియు పారిశ్రామికవేత్తలను అందరినీ తీసుకొచ్చి ఫ్లెమింగో పక్షుల అభయారణ్యం మరియు పులికాట్ పక్షుల అభయారణ్యం గురించి అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ సరస్సు ద్వారా ఎంతో మంది మత్స్యకారులు ఆధారపడి ఉన్నారని, వారి జీవనోపాధిని పెంచాలని అన్నారు. అభయారణ్యంపై ఆధారపడిన, వైజ్ఞానిక సమాజం, స్థానిక సమాజం పట్ల ప్రజలకు ,పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. రేపు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం కానున్నదని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గౌరవ టూరిజం మంత్రి వర్యులు విచ్చేయనున్నారని, మూడు రోజులు రాష్ట్ర ప్రభుత్వం నుండి మంత్రులు రానున్నారన్నారని. తిరుపతి జిల్లా నుండి మరియు సమీపంలోని నెల్లూరు మరియు చిత్తూరు జిల్లాల నుండి ప్రజా ప్రతినిధులు అదేవిధంగా ఈ పండుగకు తమిళనాడుతో పాటు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారని, ఇప్పటికే సోషల్ మీడియాలో సందడి నెలకొందని, ప్రజలందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందని పారిశు ధ్యం, ఆహారం మొదలైన అన్ని రకాల ఏర్పాట్లు చేసామన్నారు. పిల్లలు మరియు పెద్దలతో వచ్చి తిరుపతి జిల్లా ఆతిథ్యాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు. పక్షులను వీక్షించడానికి సందర్శకుల కోసం అటవీశాఖ, టూరిజం శాఖ ద్వారా గైడ్‌లు మరియు పక్షులను వీక్షించడానికి బైనాక్యులర్‌లను ఏర్పాటు చేసామని తెలిపారు. అన్ని చూసి అవగాహన పెంచుకొని ఈ పక్షులను రక్షించడంలో మీరు భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నామన్నారు. ఈ మూడు రోజు పిల్లలు,కుటుంబం తో వచ్చి జిల్లా యంత్రాంగం ఇక్కడ అందించిన సౌకర్యాలను ఆస్వాదించాలన్నారు. కెమెరాలు, డ్రోన్లు, క్రౌడ్ మేనేజ్మెంట్ కి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారి. నెల పట్టు, పులికాట్ సరస్సు ల పై అవగాహన కలిగిఉండాలని తెలిపారు. ఎంఎల్ఏ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా జరగని ఫ్లెమింగో ఫెస్టివల్ ని ఈ సంవత్సరం జనవరి 18, 19 మరియు 20 తేదీలలో మూడు రోజులు ఘనంగా పండగ వాతావరణంలో జరుపుకోవాలని మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ సహకారంతో ఫ్లెమింగో ఫెస్టివల్ ని జరుపుకోబో తున్నామన్నారు. . నియోజకవర్గంలో 5 ప్రాంతాలలో ఏర్పాటు చేసామని ప్రజలు అందరు సహకరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులకు సహకరించి ఫ్లెమింగో ఫెస్టివల్ ను బందు మిత్రులతో కలిసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా , ఆర్డిఓ కిరణ్మయి, సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వేదిక ఇన్చార్జి ద్వామా పి డి శ్రీనివాస ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 302 ద్వారా పదోన్నతులు చేపట్టాలి

విశాలాంధ్ర- పీలేరు: జీవో నెంబర్ 302 ద్వారా పదోన్నతులు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని డి.పి.సి.జి.ఎల్.ఏ రాష్ట్ర (డి.పి.సి.జి.ఎల్.ఏ) అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దేవరకొండ మురళీధర్ లు కోరారు. ఈ సందర్భంగా వారు మాటలాడుతూ ముఖ్యమంత్రి స్పందించాలి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయుటకు మన విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1998లో ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేయు అర్హత గల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చి జూనియర్ లెక్చరర్స్ గా నియమించారు .అప్పటినుండి ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తూ రెగ్యులరైజ్ అయి ప్రొబేషన్ డిక్లేర్ చేయబడి అధ్యాపకులు జీవో నెంబర్ 302 ద్వారా ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్ గాను ,డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగాను ప్రమోషన్ పొందుతూ ఉన్నారు. 2005, 2008, 2011 ,2013, 2018 సంవత్సరాలలో ఈ విధంగా ప్రమోషన్ పొందిన అధ్యాపకులు ప్రిన్సిపాల్ గాను, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారులుగాను, జిల్లా వృత్తి విద్యా అధికారులుగాను, రీజనల్ జాయిన్ డైరెక్టర్లుగాను, బోర్డులో వివిధ పదవులలో పనిచేస్తున్నారు. కొంతమంది ఆ పదవులలో పదవి విరమణ కూడా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో 2019 నుండి 2024 వరకు ఒక్క ప్రమోషన్ కూడా ఇవ్వలేదు .కానీ హడావుడిగా ఎలక్షన్ కోడ్ వచ్చిన ముందు రోజు అనగా మార్చి 15న డిపిసి అధ్యాపకులను పక్కనపెట్టి సర్వీస్ రూల్స్ తుంగలో తొక్కి 302 జీవోను అతిక్రమించి ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా ,సీనియారిటీ లిస్టును బయట పెట్టకుండా, అభ్యర్థుల సర్వీస్ వెరిఫికేషన్ చేయకుండా ,అనర్హులైన వారికి మరియు డైరెక్ట్ రిక్రూట్మెంట్ వారికి 197 మందికి మార్చ్ 15 న అడ్డదారిలో ప్రమోషన్ ఇచ్చారు. జీవో నెంబర్ 302 కు సంబంధించి సీనియార్టీ లిస్టుపై ఎటువంటి కేసులు లేకున్నా నిర్లక్ష్యం చేసి ఒకే వర్గానికి ప్రమోషన్లు కట్టిపెట్టారు . ఎలక్షన్ కోడ్ రావడంతో ప్రమోషన్లు కోర్టులో కొట్టివేసిన లెక్క చేయక ప్రమోషన్ ప్రక్రియను కొనసా గించారు. ప్రమోషన్ ప్యానెల్ ఇయర్ 31ఆగష్టు న ముగిసినప్పటికి డిసెంబర్ నెల లో 38 మంది జూనియర్స్ కు ప్రిన్సిపాల్ గా పదోన్నతి కల్పించారు.నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పెద్దలకు, నాయకులకు ,అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, న్యాయం చేయమని కోరినా అధికారులు లెక్కచేయక ప్రమోషన్ ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నారు .25 ఏళ్ల సర్వీస్ కలిగి ,పదవీ విరమణకు దగ్గరగా ఉన్న అధ్యాపకుల ఆందోళనను గుర్తించక తీవ్ర వ్యాకులతకు గురి చేయుచున్నారు .ఈ అన్యాయాన్ని సరిదిద్ది ,అక్రమ ప్రమోషన్లను రద్దుచేసి మాకు న్యాయం చేయాలని శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి డిపిసి జిజెఎల్ఏ అధ్యాపక బృందం మౌన సత్యాగ్రహ దీక్ష చేపడుతుంది . కేవలం ప్రభుత్వ దృష్టిని ఆకర్షించి సత్వరం డిపిసి అధ్యాపకులకు న్యాయం జరుగుటకు గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుటకు విజయవాడ లో ఇంటర్మీడియట్ కమీషనర్ కార్యాలయం ఎదుట 22 న డీపీసీ అధ్యాపకులు ఒకరోజు సత్యాగ్రహ మౌన దీక్ష చేపట్టడం జరుగుతుంది న్యాయాన్ని అర్థిస్తూ అన్ని వర్గాల మద్దతు కోరుతోంది అని డి.పి.సి.జి.ఎల్.ఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దేవరకొండ మురళీధర్ పేర్కొన్నారు.

పీహెచ్‌పీలచే మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటి పండుగ సందర్భంగా వెంకటేశ్వరపురం, పెన్నానది తీరంలో, నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో బ్లాక్‌బోర్డ్ మిత్రమండలి అధ్యక్షులు నరసాపురం ప్రసాద్ అధ్యక్షతన మెడికల్ క్యాంపు నిర్వహించి, అక్కడి కి విచ్చేసిన భక్తులకు ప్రథమ చికిత్స నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరిగినది. ఈ శిబిరమును సందర్శించిన కోవూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి బి.పీ చూపించుకొని మాట్లాడుతూ పండుగలు, జాతరలు, తిరునాళ్లు సందర్భంగా పీహెచ్‌పీలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అభినందనీయమని,ఇలాంటి వైద్య శిబిరాలను భక్తులందరూ సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఈ శిబిరంలో ఉచితముగా మందులు అందజేసిన నరసాపురం ప్రసాద్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీ.హెచ్.పీ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, భాస్కర్, రేష్మ,పర్వీన్ పాల్గొన్నారు.

గోమాంసం ఎగుమతులపై
పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి:మిడతల రమేష్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:నెల్లూరు నుండి గోమాంసం ఎగుమతులపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని బిజెపి నమామీ గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల క్రితం నెల్లూరులో కేరళకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న గోమాంసంతో నిండిన కంటైనర్ను మున్సిపల్ అధికారులు పోలీసులు పట్టుకున్నరు.కంటైనర్ లో 5000 కేజీల గోమాంసం ఉన్నట్లు మున్సిపల్ వైద్య శాఖ అధికారులు ధ్రువీకరించారు. ఒక కంటైనరే కాకుండా మరో కంటైనర్ లో సగభాగం గోమాంసం ను పట్టుకున్నట్లు ప్రజలలో చర్చ జరుగుతుంది నెల్లూరులో మాయమైపోతున్న గోసంపదను మాంసం ఎగుమతులు చేసే ఒక మాఫియా తరలించుకుపోతున్నట్లు నిర్ధారణ అయింది. ఇప్పటి వరకు గోవులు కనిపించలేదంటే మున్సిపల్ అధికారులు తీసుకుపోయారని భావిస్తూ వచ్చాము . నెల్లూరులోపెద్ద ఎత్తున గోమాంసం పట్టు పడటంతో ఉన్నత స్థాయి అధికారులు దర్యాప్తు జరపాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. గో వద నిషేధానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉంది. ప్రత్యేకించి పోలీసు శాఖ స్పందించి గో మాఫియాను నిర్మూలించాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.

గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర- ఉదయగిరి: మండల పరిధిలోని బండగానపల్లి గంగుల వారి చెరువుపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట వేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకున్న వారు కనిష్ట మద్దతు ధర (ఎం ఎస్ పి) కంటే తక్కువ ధరకు వరి పంటను అమ్మొద్దు అని సూచించారు. బయట తక్కువ ధరకు దళారులు కొనుగోలు చేస్తే గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వపరంగా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను ప్రభుత్వమే కొంటుంది అని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వము జారీ జారీ చేసిన ఎం ఎస్ పి ధరల వివరాలు వివరించారు. క్వింటాకు కామన్ రకం ధర అయితే రూ2300/- గ్రేడ్ ఏ రూ.2320/- ఉన్నట్లు తెలియజేశారు. తరువాత క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి వరిలో ఉల్లికోడు మరియు ఆకు ముడత, మొక్కజొన్నలో కత్తెర పురుగులను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులందరూ తప్పనిసరిగా రబీ ఈ పంట నమోదు చేసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ వినోద్, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

పడినప్పుడే ఎలా నిలబడాలో నేర్చుకుందాం

- కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

విశాలాంధ్ర -కావలి: జీవితమనేది ఒక పోరాటమని, పడినప్పుడే ఎలా నిలబడాలో నేర్చుకుంటామని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కెకెఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ క్రికెట్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్ విజేతలకు గురువారం రాత్రి ఆయన బహుమతులను అందజేశారు. విజేతలైన టీమ్, తన పొలిటికల్ టీమ్ కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఎమ్మెల్యే గారు క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, గెలిస్తే గర్వ పడటం, ఓటమి చెందితే కుంగి పోవడం చేయరాదన్నారు. మనసును ఏకాగ్రతగా ఉంచుకుంటే విజయం లభిస్తుందని తెలిపారు. కష్టాన్ని ఇష్టంగా మలచుకుంటే దేన్నైనా సాధించవచ్చని తెలిపారు. కష్టపడందే విజయం దక్కదన్నారు. జీవితంలో ఏదైనా మొదట సుఖాన్ని ఇచ్చేది చివరకు దుఖాన్ని మిగులుస్తుందని, అదే కష్టాలతో ప్రారంభం అయితే విజయాలతో, సుఖాలతో ముగుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటమి నుండి గుణపాఠం నేర్చుకొని విజయానికి నాంది పలకాలని కోరారు. టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, స్థానిక వార్డు ఇంచార్జి ప్రళయకావేరి మల్లికార్జున, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వాలు తీసుకున్న తెదేపా నాయకులు

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక పట్టణంలో తెలుగు దేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలను శాసన సభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా శుక్రవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న గండిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు రెడ్డి బత్తిన నరసింహారావు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజా ఆదరణ చూసి లక్షలాదిమంది పార్టీ సభ్యత్వాలు స్వీకరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు బలపరిచారని తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలు ఎక్కువమంది నాయకులు తీసుకునేందుకు చొరవచూపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారిని ప్రత్యేకంగా అభినందించారు.

అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు కోదండరామాపురం దేవాంగులు వీధిలో వెలసి ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారికి శుక్రవారం ఏడాది పండుగ సందర్భంగా పంచామృతాలతో అభిషేకం భక్తుల పొంగళ్ళ అంబళ్ళు కార్యక్రమం విశేష దేవి ఖడ్గమాలార్చన పూజ కుంకుమా ర్చనలు నిర్వహించ బడ్డాయి ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా గందల్ల కృష్ణయ్య అన్న పూర్ణమ్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వందలాది మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కలు తీర్చుకున్నారు అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది

అనధికార బ్యారన్ నిర్మాణాలపై చర్యలు

వేలం కేంద్రం నిర్వహణ అధికారి ఎం. కిరణ్

విశాలాంధ్ర- కందుకూరు రూరల్ : కందుకూరు 26వ వేలం నిర్వహణాధికారి యం.కిరణ్ ఆధ్వర్యంలో అనధికార బ్యారన్ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. వేలం కేంద్రం పరిధిలో గల మండలాలైన పొన్నలూరు, కందు కూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండల తహశీల్దార్ కార్యాలయంలను సందర్శించి 2024-25 సంవత్సర కాలంలో పొగాకు రైతులు చేపట్టిన అనధికార బ్యారన్ల జాబితాను తహశీల్దార్లకు పంచాయితీ సెక్రటరీ / వీఆర్ఓ లకు సమర్పించి పొగాకు బోర్డు వారు అనధికారిక బ్యారన్ నిర్మాణాలపై చేపడుతున్న చర్యలును వివరించి పొగాకు బోర్డ్ వారు అట్టి నిర్మాణాలును నిలువరించేందుకు జారీచేసిన నోటీసును,కాపీలును అందజేసి రాష్ట్ర ప్రభుత్వ నియమావళిని అనుసరించి అక్రమ బ్యారన్ నిర్మాణాలును నిలువరించే దిశగా తగు చర్యలును చేపట్టవలసినదిగా సూచించారు.

ప్రతి సచివాలయంలో మోడీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

- బిజెపి మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి

విశాలాంధ్ర- జలదంకి: జలదంకి గ్రామంలోని సచివాలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేక పోవడంతో మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి మోడీ చిత్రపటాలను పంచాయతీ అధికారులుకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు చల్లా హనుమ రెడ్డి, రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడిచినా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నరేంద్ర మోడీ చిత్ర పటాన్ని పెట్టకుండా విస్మరించారని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మోడీ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్, యువ మోర్చా నాయకులు ఆతిన చైతన్య యాదవ్, భీమవరపు మహేష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-రాపూరు: వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు సిబ్బంది కివిల్ సి డిసి (లేప్రోసి కేసు డిటెక్షన్ కాంపెయిన్) లేప్రోసి కేసుల ఇంటింటి సర్వే ద్వారా గుర్తిం చడం మీద శిక్షణ కార్యక్రమం శుక్ర వారం నిర్వహించడం జరిగింది 20. 01.2025 నుండి 02.02 2025 వరకు 14 రోజులపాటు ఈ సర్వే కార్యక్రమం జరుగుతుందని, లేప్రోసి వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాపించు విధానం, చికిత్స పద్ధతులు, లేప్రోసి సర్వే చేయునపుడు పాటించవలసిన పద్ధతులు గురించి వివరంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని ముఖ్యంగా బయట పడకుండా దాచి పెట్టి ఉంచిన కేసులను ఈ సర్వేలో గుర్తించాలని చెప్పడం జరిగిందని. వెపినాపి ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రమీల రాజకుమారి తెలియ జెసా రు.ఈ కార్యక్రమం లో వేపి నాపి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రమీలా రాజకుమారి , రాపూరు కో లొకేటెడ్ పిహెచ్ సి మెడికల్ ఆఫీ సర్ డాక్టర్ జుఫీ భాను, సూపర్ వైజర్ సిబ్బంది, ఏఎన్ఎం లు, ఎం ఎల్ హెచ్ పిలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ నూతన భవనాల పరిశీలన

విశాలాంధ్ర–ఉదయగిరి: పట్టణంలోని శ్రీ మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణము కళాశాల ప్రాంగణమును స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డిగ్రీ కళాశాలను అభివృద్ధి పరిచే ఆలోచనలో భాగంగా భవన నిర్మాణం, మరమ్మత్తుల కొరకు ఐదు కోట్ల రూపాయలను కేటాయించడం జరిగినదని, నూతన భవన నిర్మాణ కొరకు కాలేజీ ప్రాంగణమును పరిశీలించామని, సంబంధిత అధికారులకు పక్కా ప్రణాళిక నమూనాను తయారుచేయమని సూచించారు. భవన నిర్మాణ నమూనాలో మరలా మరలా మార్పులు చేయకుండా భవన నిర్మాణమును చేపట్టాలన్నారు కాంట్రాక్టర్ ను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించిన వడ్లమూడి నాగేంద్ర

వడ్లమూడిని అభినందించిన కాకర్ల

విశాలాంధ్ర–వరికుంటపాడు: ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండల టిడిపి సీనియర్ రాజకీయ నాయకులు, వేంపాడు టిడిపి నాయకులు వడ్లమూడి నాగేంద్ర ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి సభ్యత్వ నమోదు భారీ స్థాయిలో నమోదు కావడం జరిగిందని అలాగే శాశ్వత సభ్యత్వాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నట్లు అన్నారు. శాశ్వత సభ్యత్వం స్వీకరించిన టిడిపి నాయకులు వడ్లమూడి నాగేంద్ర ను కాకర్ల సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు

నేడు స్వచ్ఛ ఆంధ్ర దివాస్

విశాలాంధ్ర–గుడ్లూరు: మండలంలో స్వచ్ఛ ఆంధ్ర దివాస్ క్యాంపెయిన్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి మాసంలో మూడవ శనివారము నిర్వహించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్రావు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానంగా పారిశుధ్యం పై ప్రజలలో అవగాహన పెంచడం మరియు సమాజంలో పరిశుభ్రతా ప్రమాణాలను పెంపొందించడం పరిసరాల పరిశుభ్రతపైన మరియు బహిరంగ ప్రదేశాలలోను,ఆవాస ప్రాంతాలలోనూ పాఠశాలలు ఆసుపత్రులు తదితర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడంపై ప్రజలకు అవగాహన కల్పించటం, మురుగు నీటి నిర్వహణ,ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, స్వచ్ఛభారత్ మిషన్‌కు రాష్ట్ర స్థాయిలో అందించిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించడం స్థానిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మరియు విద్యార్థుల తో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయడం అలాగే సామూహిక శ్రమదానం స్థానిక నాయకులు, అధికారులు, మరియు సామాన్య ప్రజలు కలిసి పరిశుభ్రతా పనుల్లో పాల్గొని నిరంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ క్యాంపెయిన్ ద్వారా అన్ని గ్రామ పంచాయతీలలో పర్యావరణ హితమైన జీవనశైలికి ప్రజలు అలవాటు పడేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి మూడవ శనివారము ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోనికి అవగాహన కొరకు తీసుకొని రావడం జరుగుతుంది.

అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లాప్రొబేషన్ అధికారి బి.జి.కె కాశీమ్ దొర

విశాలాంధ్ర–బిట్రగుంట: జిల్లాలో అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా ప్రొబేషన్ అధికారి బి.జి.కె.కాశీమ్ దొర అన్నారు. శుక్రవారం కావలిలోని జెంస్ మరియు, బోగోలు మండలం ముంగమూరు క్రాస్ రోడ్డు వద్ద గల బాలల రక్షణ, ఆధరణ కొరకు నిర్వహిస్తున్న స్వచ్ఛంద , బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేసి వాటి నిర్వహణకు రిజిస్ట్రేషన్ విధిగా చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కాశీం దొర మాట్లాడుతూ బాలల న్యాయ చట్టం సెక్షన్ 41ప్రకారం బాలల రక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నాడు. జిల్లా బాలల రక్షిత గృహల తనిఖీ బృందం, కావలి సిడిపిఒ సౌజన్యతో కలిసి కందుకూరు చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించి హోమ్ నిర్వహణా విధానాన్ని, రికార్డుల నిర్వహణ, పిల్లలకు మౌలిక వసతుల కల్పన మొదలగు అంశాలను పరిశీలించారు. చిల్డ్రన్స్ హోమ్ రిజిస్ట్రేషన్ కొరకుచేసుకున్న దరఖాస్తుపరిశీలనపై హోమ్ ను సందర్శించిన బృంద సభ్యులు హోమ్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పై కార్యక్రమంలో అధికారుల సుమలత ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్స్టిట్యూషనల్ కేర్),సమత ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్), మంజుల లీగల్ కమ్ ప్రొబేషన ఆఫీసర్ పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర, ఎన్ ఎస్ ఎస్ , కే సి డి సి

సంయుక్త ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు :నెల్లూరు నగరంలోని వి.ఆర్.సి సెంటర్ లో శుక్రవారం నాడు రహదారి భద్రతా వారోత్సవాలు (ట్రాఫిక్ పై అవగాహన వాలంటరింగ్ పోలీసు) ఘనంగా మొదలైంది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సౌత్ ట్రాఫిక్ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి , ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, ఎస్సై హరి కృష్ణ పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 23 వరకు ఈ భద్రత వారోత్సవాలు జరుగుతాయి అని, యువత ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి అని, అలానే ప్రజలకు అవగాహన కల్పించాలి అని ట్రాఫిక్ సమస్యలు వల్ల అనేక ఇబ్బందులు ఎదురువుతునాయి అని వీటిని అధిగమించాలని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణగా వాహనాలు నడపాలి, మద్యం సేవించి వాహనాలు నడపటం వల్లన అనేక సమస్యలు వస్తున్నాయి అని ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు..అనంతరం ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ యువత హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వల్లన ప్రమాదాలు నివారించవచ్చు అని అలానే మొబైల్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరం అని వీటి అన్నిటిమీద ప్రజలకు మన ద్వారా అవగాహన కల్పించాలి అని తెలిపారు.. అనంతరం ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నియమాలకు కట్టుబడి ఉండాలని , పెద్దవారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలి, అలానే మొబైల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరం అని ప్రజలకు వాలంటరీగ్ ద్వారా మీరు తెలియజేయాలని ట్రాఫిక్ సమస్యలు ప్రజలకు వివరించాలని తెలిపారు.. అనంతరం ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఎన్ వై కే వాలంటీర్లు బి.సతీష్ కుమార్, కవిత, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 2007-09

విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర–కందుకూరు రూరల్ : కందుకూరులోని టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 2007–09 విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యని అభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాల ప్రాంగణము నందు జరిగినది. ఈ కార్యక్రమమును దృఢ సంకల్పంతో ముందుకు నడిపిన రథసారథులు బాలాజీ, సుమాంజలి గౌసియా భాను,నేతృత్వంలో కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ వలి హాజరైనారు. పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మీరందరూ కళాశాల నుండి బయటకు వెళ్లి 16 సంవత్సరములైనను మీ స్నేహితులను,కళాశాలను గుర్తుపెట్టుకుని ఇటువంటి కార్యక్రమం చేపట్టటం గర్వించదగ్గ విషయమని, సమాజానికి మీరందరూ మంచి సంకల్పంతో పనిచేయాలని, మీలో ఉన్న అపరిచితుడు ని బయటకు తీసి మంచి వ్యక్తులుగా తయారు కావాలని, మీరువెవరు కూడా తక్కువ అంచనా వేసుకోవద్దని అన్నారు.మీకు ఆర్థిక స్థితి సామాజిక స్థితి రాజకీయ స్థితిని పెంపొందించుకోవడానికి, మనకంటూ ఒక గుర్తింపు వచ్చే విధంగా తయారు కావాలి అని తెలిపారు. చిన్నతనం నుంచి లీడర్షిప్ క్వాలిటీని పెంపొందించుకోవాలని తెలిపారు.మగ పిల్లల కంటే ఆడపిల్లలు సమాజంలో అన్ని విషయంలో ముందుకెళ్తున్నారని ఇక్కడికి విచ్చేసిన ఆడపిల్లలందరూ కూడా మంచి ఉన్నత స్థితికి చేరుకొని కళాశాలకు, మీ కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఏదైనా గాని ఒక లక్ష్యములేని జీవితము వ్యర్థము అని పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో మంచి వసతులు ఉన్నాయని మీ బంధువులని చుట్టుపక్కల పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలియపరచి, వచ్చే సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచుటలో మీ వంతును అందించాలని, రాబోయే కాలంలో ఒక రోజు గత 30 సంవత్సరముల నుంచి కళాశాలలో చదివి ఉన్నత స్థితిలో ఉన్న వారిని కలిపి ఒక సమావేశం ఏర్పాటు చేయటానికి సన్నాహం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అందరూ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయముగా పదివేల రూపాయలు పైకమును ప్రిన్సిపల్ కి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తొట్టెంపూడి సుబ్బారావు , చుండూరి బాబురావు ,కలగట్ల హజరత్తయ్య ,కాశీ రత్నం, అక్రమ్, మాధవరావు,పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.